క్లుప్తంగా

గంగమ్మ తల్లికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌కుమార్‌రెడ్డిలు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్క దేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిన్నదండ్లూరులో నాకాబందీ



నాకా బందీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కలమల్ల పోలీస్ సిబ్బందితో నాకాబందీ నిర్వహించినట్లు కలమల్ల ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరు వర్గాల ఇళ్లలో, కలాల్లో సోదాలు చేశారు. గ్రామంలోని వీధులలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

నేడు ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధి చిన్నరంగాపురం గ్రామ సమీపంలోని ఫుడ్‌అండ్ స్పైసెస్ కళాశాలలో సోమవారం ఉదయం 10.30 గంటలకు పులివెందుల ప్రాంత రైతులకు ఉద్యాన పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్ మీద వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాపునకు ఎఫ్‌పీఓ గ్రూపు సభ్యులు, పారిశ్రామికవేత్తలు వస్తున్నారని.. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక పార్కువీధికి చెందిన కల్లూరు మేఘన (18) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ పిచ్చయ్య పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తూ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన పోచిమరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మృతురాలి దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేత్రదానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని గాడిచర్ల వీధిలో నివాసముంటున్న జి.అనసూయమ్మ ఆదివారం అనారోగ్యంతో మరణించింది. ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు సిబ్బంది హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానం చేయదల్చుకున్నవారు 9966509364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

– ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఆకస్మిక తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే చర్యలను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మానుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బోధనేతర పనులు, ఇతర విద్యాబోధనకు సంబంధించని పనుల వల్ల ఉపాధ్యాయులు ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని వారి సమస్యలను పరిష్కరించి ప్రాత్సహించాల్సింది పోయి వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు, పీఆర్‌సీ, డీఏ బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు



శ్రీవారి ఊంజల్ సేవలో భక్తులు

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డున వెలసిన శ్రీ వేంకటరమణుడి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆ దేవ దేవుడిని భక్తులు దర్శించుకుని తరించారు. ప్రత్యేక వాహనంలో స్వామివారిని రకరకాల పూలతో అలంకరించి పట్టణం పురవీధులైన మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, గంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. తమ ఇంటి ముంగిటకు స్వామివారు రాగానే భక్తిశ్రద్ధలతో భక్తులు కాయ, కర్పూరం, నైవేద్యాలు సమర్పించారు.

ప్రత్యేక పూజలు : శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రెండవరోజు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉదయం సుప్రభాత సేవ.. తోమాల సేవతోపాటు ధ్వజారోహణం చేపట్టారు. సాయంత్రం సహస్రనామార్చన, నివేదన, యాగశాల ప్రవేశం, పుణ్యాహక వాచనం, నిత్య హోమం, వాస్తు హోమంతోపాటు తదితర పూజలు నిర్వహించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఊంజల్ సేవలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

శాస్త్రోక్తంగా బాలాలయ సంప్రోక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : మండల పరిధి దుగ్గాయపల్లెలోని గ్రామ దేవత గంగమ్మతల్లి, దత్తాత్రేయ స్వాముల ఆలయాల పునః నిర్మాణంలో భాగంగా ఆదివారం బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు విజయ్ బట్టార్ ఆధ్వర్యంలో ఆలయంలో వివిధ హోమాలను, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పుణ్యాహవాచనం, కళశ స్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌ల శక్తిని కళశాల్లోకి ఆవాహన చేశారు. కళశాలను, విగ్రహాలను బాలాలయంలోకి చేర్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు హోమ ప్రదక్షిణలు చేసి కాయ కర్పూరాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

పూజల్లో పాల్గొన్న ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్

స్వగ్రామమైన దుగ్గాయపల్లెలోని పురాతన ఆలయాల పునః నిర్మాణంలో భాగంగా జరిగిన బాలాలయ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పండితులతో ఆలయ నిర్మాణం గురించి చర్చించి అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయాలు శిథిల దశకు చేరడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో నూతన ఆలయాలను నిర్మించడానికి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పచ్చారు వెంకటేశు, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఓవీ సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, జయచంద్ర, ప్రవీణ్‌రెడ్డి, సుబ్బయ్య, మునీంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న న్యూరో వైద్యులు నవీన్

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఈ–గఫారియా నందు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం దర్గా–ఈ–గఫారియా, నవీన్ న్యూరో కేర్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో మెదడు, వెన్నుపూస, నరములు, కండరాలు తదితర రోగాలకు సంబంధించిన 320 మందిని ప్రముఖ న్యూరో వైద్యులు నవీన్ కుమార్, ఎముకల వైద్య నిపుణులు సతీష్‌లు పరీక్షించి వైద్య సేవలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎలాంటి జ్వరాలు, నొప్పులు ఉన్నా తక్షణం ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రత పాటిస్తే సగం రోగాలు దూరం అవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత ఇస్మాయిల్, ప్రజలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అన్నదానం

పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియాలో భక్తి శ్రద్ధలతో అన్నదానం నిర్వహించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో వెలసిన శ్రీ హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక పెద్ద దర్గాలో పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. స్వామి వారి మజార్లపై పూలచాదర్లు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు మౌలానా స్వామి, సర్ఫరాజ్, పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు



నేతాజీనగర్‌లో జ్యోతి ఉత్సవాల దృశ్యం

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరులో రామలింగ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు జ్యోతులను తయారుచేసి వాటిని నెత్తిమీద పెట్టుకుని కన్నెలూరులోని పురవీధుల గుండా చౌడేశ్వరిదేవి కీర్తనలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ భక్తితో ఊరేగించారు.

శిల్పారామంలో సండే సందడి



వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి నెలకొంది. పారిశ్రామికవేత్త ప్రసాద్ సౌజన్యంతో ఎస్‌కే డ్యాన్స్ స్టూడియో డ్యాన్స్ మాస్టర్ చిట్టి శిష్య బృందం జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల స్టెప్పులు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజారావుకు మొల్లసాహితీ సేవా పురస్కారం ప్రదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శతావధాని నరాల రామారెడ్డి సాహితీ కార్యాలయంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన పద్యకవి, చందస్సు నవ్యసాచి విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావుకు మొల్లసాహితీసేవా పురస్కారం ప్రదానం చేశారు. మొల్ల సాహితీ పురస్కారం, నగదు పారితోషికం, శాలువవ, జ్ఞాపికను ఆయనకు అందజేశారు. సాహితీ సేవకు గాను ఈ పురస్కారాన్ని అందించినట్లు హనుమంతరావు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

సింహాద్రిపురం : శాంత్రిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన దిద్దేకుంట గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే సానుకూలంగా పరిష్కరించుకోవాలని.. లేకుంటే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలే తప్ప తమంతట తామే చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బాలమద్దిలేటి, లింగాల ఎస్‌ఐ హృషికేశవరెడ్డి, సింహాద్రిపురం ఏఎస్‌ఐ హాజీబాషా, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరులో చేతివాటం

ముద్దనూరు : మండలంలోని వ్యవసాయదారులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లను అందజేసే సమయంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయానికి ట్రాన్స్‌ఫార్మర్‌లు కావలసిన రైతులు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్ వరుస క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరవుతాయి. మండలంలోని ఆయా సబ్ స్టేషన్‌ల ద్వారా రైతులకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌లు అందజేస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌లు రైతులకు అందించే సమయంలో అధికారులు తమవద్ద నుంచి అదనంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు, డబ్బు ఇవ్వకపోతే పలుకారణాలు చెప్పి అందజేయడంలేదని, పంటల సాగును దృష్టిలో పెట్టుకుని విద్యుత్ అధికారులు అడిగినంత సొమ్ము చెల్లించాల్సివస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.5 నుంచి రూ.8 వేల వరకు లంచం చెల్లించాల్సివస్తోందని, గత 4 నెలల నుంచి సుమారు 80 ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరైనట్లు, ప్రభుత్వం పారదర్శకంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను అందిస్తున్నా విద్యుత్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుండటం శోచనీయమని రైతులు వాపోతున్నారు. సబ్‌స్టేషన్‌లో మీసేవ ద్వారా దరఖాస్తు కాకుండా ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా దరఖాస్తులు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆదర్శనేత వేంపల్లె దస్తగిరి



వేంపల్లె దస్తగిరి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వీరపునాయునిపల్లె : బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఆదర్శ నేత వేంపల్లె దస్తగిరి అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని య. నాజుపాలెం గ్రామంలోని దస్తగిరి వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. పెత్తందారి విధానానికి స్వస్తి పలకాలని పోరాటం చేసిన వ్యక్తి దస్తగిరి అన్నారు. పోరాటంలో కీలక వ్యక్తి పాలెం చెన్నారెడ్డి ఉనికిని పుచ్చుకొని నిబద్ధతో ఆదర్శవంతమైన జీవితం గడిపాడన్నారు. గ్రామంలో ఏ ఒక్కరికి ఇబ్బంది కలిగినా తాను ఇబ్బందికి గురైనట్లు భావించి జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ నాయకుల సమన్వయంతో సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కమలాపురం ఏరియా కార్యదర్శి పి. చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాదుల్లా, గంగా సురేష్, విద్యార్థి నాయకులు పాలెం కొండారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, తదితరులు

చెన్నూరు : స్థానిక మూడవ వార్డు మైనార్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల మైనార్టీ కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డికి కాలనీ వాసులు రోడ్డుకు సంబంధించిన సమస్యను విన్నవించారు. 20 సంవత్సరాలుగా ఇక్కడ రోడ్డు పనులు చేపట్టక రోడ్డు గుంతల మయమై తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌కు సూచిచడంతో ఆయన ఆధ్వర్యంలో మైనార్టీ కాలనీ మూడో వార్డులో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయంగా స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాదక్ అలీ, ఉప సర్పంచ్ జుమన్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకులు సురతాని శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అజ్మీర్ షరీఫ్ ఉరుసు మహోత్సవం



జెండా ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతి

జమ్మలమడుగు : అజ్మీర్ ఖాజా గరిబున్‌నవాజ్ 811వ ఉరుసు మహోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పక్కీర్లు చేసిన మేళా భక్తులను అలరించింది. అనంతరం జెండాలను దస్తగిరి స్వామి దర్గాల వద్ద ఎక్కించారు. దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, సోదరుడు సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ, సయ్యద్ షా భక్తియార్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

వేంపల్లె : పట్టణంలోని తలిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1993–94 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రవిశంకర్‌గౌడ్, యోగాంజనేయులు, భాస్కర్‌బాబు, రామకృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పటి గురువులు జయమ్మ, ఉషారాణి, వెంకట్రామిరెడ్డి, పుల్లారెడ్డి, ఆదినారాయణలకు కొత్త బట్టలు అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు దేశానికి సేవ చేసే ఆర్మీగా, గ్రామాన్ని అభివద్ధి చేసే సర్పంచ్‌గా, ప్రభుత్వ ఉద్యోగులుగా, రాజకీయ నాయకులుగా స్థిరపడటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వపు విద్యార్థులందూ గురువులతో కలిసి భోజనం చేశారు.

కార్పొరేట్ కంపెనీలకు కేంద్రం తొత్తు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు తొత్తుగా వ్యవహరిస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను తాకట్టు పెడుతోందని ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయకుండా కొనసాగించాలన్నారు. ప్రతి ఉపాధి కూలీకి రోజుకు రూ. 600 కూలీ ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ఏప్రిల్ 5న ఛలో డిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

చక్రస్నానానికి పుష్కరిణి సిద్ధం



చక్రస్నానానికి సిద్ధమైన పుష్కరిణి

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఈ సంవత్సరం ఒక విశేషం చోటుచేసుకుంది. ఆలయ పుష్కరిణి ప్రస్తుతం నూతన ఆకర్శణలను సంతరించుకుంది. నెల రోజుల కిందట ఆలయాన్ని దర్శించుకున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మయ్య సూచించిన మేరకు పుష్కరిణిని ఆకర్శణీయంగా తీర్చిదిద్దారు. నీటిని పూర్తిగా మార్చివేసి అడుగున నూతన ఫ్లోరింగ్ వేశారు. జంతువులు రాకుండా పుష్కరిణి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. డ్రైనేజీ నీరు పుష్కరిణిలో కలువకుండా వెళ్లేందుకు పక్కదారి కాలువలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి చక్రస్నానం చేయించనున్నారు. ఈ ఉత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి అటు ప్రజలు, ఇటు అధికారుల ప్రశంసలు పొందడం విశేషం.

ఉత్సవ వివరాలు

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9.00 నుంచి దేవునికడప మాడవీధుల్లో భక్తులు, ఆలయ నిర్వాహకులు, అర్చక బృందాలు వసంతోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు అవభృథస్నానము నిర్వహింపజేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు యదావిధిగా ఊంజల సేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తిగీతాలాపనలు ఉంటాయి. రాత్రి 8.00 నుంచి 9.00 గంటల్లోపుగా హంస వాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగిస్తారు. 9.00 నుంచి 9.30 గంటల్లోపుగా ధ్వజావరోహణం చేయనున్నారు.

గూగుల్ కన్నా గురువే మిన్న

కడప ఎడ్యుకేషన్: గూగుల్ కన్నా గురువే మిన్న అని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం కడప పట్టణంలోని విశ్వ హిందూ పరిషత్ సమావేశ మందిరంలో వారి అధ్యక్షతన నిర్వహించిన కర్తవ్యబోధ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువుల ప్రత్యక్ష బోధనతో మాత్రమే విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎన్ని సాంకేతిక విధానాలు వచ్చినప్పటికీ ఉపాధ్యాయుడు లేని విద్య రాణించదన్నారు. రాష్ట్ర సహాధ్యక్షురాలు రామోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నాడు– నేడు పనిభారం తగ్గించి ఆ పనిని ఇతరులకు కేటాయించాలని అనవసరమైన యాపుల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్ మాట్లాడారు.